క్లుప్తంగా

పాడిరైతులకు బోనస్ అందజేత



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు):స్థానిక కృష్ణా మిల్క్ యూనియన్ వారి పాల కేంద్రంలో సోమవారం 104మంది రైతులకు బోనస్‌కింద రూ.2,04,401 పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షులు కొత్తపలి రామనాథం, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సంఘ కార్యదర్శి రామకృష్ణ, డైరెక్టర్లు, పాడిరైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక కెనరాబ్యాంక్ మేనేజర్ వెంకటదుర్గా ఐక్యశ్రీ తన కుమార్తె పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం అనిగండ్లపాడు ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం శెట్టిపోగు రాము, టీచర్లు బియ్యాల రామారావు, గోపీకృష్ణ, అంకమ్మ, ఎస్‌ఎంసీ సభ్యులు కోట శాంతమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

200 కుర్చీలు వితరణ

నందిగామరూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సోమవారం స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు 200 కుర్చీలు, 10 స్టూళ్లు, రెండు టేబుళ్లు, ఒక టీపాయ్ అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలకు సహకరించిన దాతలు చల్లా వెంకట నరసయ్య, చల్లా వెంకటేశ్వరరావు, పులిపాటి సాయి వర్ధిని తదితరులకు క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కొప్పు మురళీకృష్ణ, పబ్బతి కిషోర్, కేతేపల్లి సత్యంబాబు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3.85 లక్షలు



నందిగామటౌన్: హుండీ కానుకల ద్వారా రామలింగేశ్వరస్వామి వారికి రూ.3.85 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో సురేష్ తెలిపారు. స్థానిక శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. మొత్తం 270 రోజులకు గాను రూ.3.85లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో వివరించారు. గ్రూపు టెంపుల్స్ ఈవో నరసింహమూర్తి, అనువంశిక ధర్మకర్త మురళి రాఘవకుమార్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

షాపుల వేలం వాయిదా

నందిగామరూరల్:మండల పరిషత్ కార్యాలయ షాపింగ్ కాంప్లెక్స్‌లోని మూడు దుకాణాల వేలం వాయిదా పడింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించగా, ఎవ్వరూ ఆసక్తిచూపకపోవడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మరోసారి వేలం ప్రక్రియను నిర్వహిస్తామని ఎంపీడీవో వివరించారు.

పెట్రోలు బంక్‌ల తనిఖీ



పెనుగంచిప్రోలు: పెట్రోలు అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి హెచ్చరించారు. పెనుగంచిప్రోలులోని పెట్రోల్ బంక్‌లను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పెట్రోలు బంక్‌లో నిబంధనలను పాటించాలని యజమానులను ఆదేశించారు. పెట్రోలు బంక్‌లో అవకతవకలు సాగుతున్నట్లు అనుమానాలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. ఆమె వెంట ఆర్‌ఐ హలీమ్, వీఆర్వోలు ఉన్నారు.

341 మందికి వైద్య పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక ఆర్టీసీ కాలనీలో స్కిల్ డెవలప్‌మెంట్ కమ్యూనిటీ భవన్ వద్ద సోమవారం జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు మొత్తం 341 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ తెలిపారు. 127 మందికి కళ్లజోళ్లు, 42మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు వివరించారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్లు కట్టా నరసింహారావు, మైనేని రాధా, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



శనగపాడు వద్ద వరదకు కొట్టుకుపోయిన వాగు చప్టా



అనిగండ్లపాడు వద్ద దారుణంగా దెబ్బతిన్న రోడ్డు

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

పెనుగంచిప్రోలు: వారంరోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పెనుగంచిప్రోలు మండలంలోని పలు గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. ఆయా రోడ్లు పలుచోట్ల కోతకు గురికావడంతోపాటు గోతులు ఏర్పడటంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఈ వర్షాలకు శనగపాడు వద్ద వాగు పొంగడంతో కల్వర్టు కొంతభాగం కొట్టుకుపోయింది. తాత్కాలికంగా మట్టిపోసి రాకపోకలు సాగిస్తుండగా ఇంకా చప్టా సగం కొట్టుకుపోయి అలానే ఉంది. అనిగండ్లపాడు వద్ద కూచివాగు, దూళ్లవాగు పొంగడంతో రోడ్డంతా కొట్టుకుపోయి గోతులు ఏర్పడ్డాయి. పెనుగంచిప్రోలు నుంచి సుబ్బాయిగూడెం వెళ్లే రోడ్డులోనూ పెద్దగుంతలు పడి పరిస్థితి ప్రమాదకరంగా మారింది.సుబ్బాయిగూడెం-కొళ్లికూళ్ల గ్రామాల మధ్యలో వాగు పొంగి రోడ్డు దారుణంగా దెబ్బతింది. దీంతో ఈ రోడ్లలో ప్రయాణం సజావుగా సాగక ప్రజలు అవస్థలుపడుతున్నారు. కూటమి పాలకులు, అధికారులు స్పందించి ఆయా రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వర్షాలకు దెబ్బతిన్న గుమ్మడిదుర్రు-అనిగండ్లపాడు రోడ్డు



సుబ్బాయిగూడెం రోడ్డులో చెరువుకట్ట వద్ద రోడ్డు పరిస్థితి



కొళ్లికూళ్ల వద్ద కోతకు గురైన రోడ్డు

పీజీఆర్‌ఎస్‌కు తొమ్మిది అర్జీలు

నందిగామరూరల్:ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారించాలని కోరుతూ తొమ్మిది అర్జీలు అందినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి మూడు అర్జీలు, సర్వే విభాగం ఒకటి, పంచాయతీరాజ్ శాఖ ఒకటి, మున్సిపాలిటీ ఒకటి, విద్యాశాఖకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు వివరించారు. ఆయా అర్జీలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



అర్జీని పరిశీలిస్తున్న ఆర్డీవో కె.బాలకృష్ణ

జీవీ మాల్ నిర్వాహకులపై ఫిర్యాదు

నందిగామటౌన్: నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన జీవీ మాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాగల్లు గ్రామానికి చెందిన బచ్చలకూరి చంద్రరావుతోపాటు పలువురు సోమవారం ఆర్డీవోను కలిసి ఫిర్యాదు చేశారు. జీవీ మాల్ భవన నిర్మాణానికి తగిన అనుమతులు, పార్కింగ్ వసతి లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాల్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కుద్దూస్, చంటి, సీతారామయ్య, మస్తాన్, తదితరులు కోరారు.

వరి సాగు పనులు ప్రారంభం



పల్లగిరి గ్రామ సమీపంలో వరినాట్ల కోసం పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

- పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు..
- భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఆందోళన

నందిగామరూరల్: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నందిగామ మండలంలోని రైతులు ఖరీఫ్ వరి సాగు పనులను ప్రారంభించారు. సాగర్ జలాల విడుదల ఆలస్యం కావడంతో మండలంలో ఇప్పటివరకు ప్రారంభంకాని ఖరీఫ్ సాగులను వర్షాల నేపథ్యంలో రైతులు మొదలుపెట్టారు. చెరువులు, బావులు, బోర్ల కింద ఇప్పటికే మాగాణి సాగు చేపట్టగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మిగిలిన రైతులు కూడా సాగుపనులు చేపట్టారు.

4,800 ఎకరాలలో వరిసాగు..

నందిగామ మండలంలో రైతులు 4,800 ఎకరాలలో వరిసాగు చేపట్టనున్నట్లు సమాచారం. వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పలుచోట్ల నారుమడులు కూడా కొట్టుకుపోవడంతో తిరిగి వరినారు పోసుకునేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. అయితే సాగు పనులు చేపడుతున్న మాగాణి రైతులను తాజా తుఫాన్ హెచ్చరికలు కలవరపెడుతున్నాయి. మరో పదిరోజుల్లో వరినాట్లు పూర్తయ్యే పరిస్థితి ఉండగా, ఈ సమయంలో భారీ వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.



వరి నారుమడి

ఆందోళనగా ఉంది..



మాగాణి సాగుకు పంటపొలాలను సిద్ధం చేస్తున్నాం. వర్షాలు కురుస్తుండటంతోపాటు సాగర్ జలాలు కూడా వస్తుండటంతో సాగుకు సమాయత్తమవుతున్నాం. పదిరోజుల్లో నాట్లు పూర్తయ్యే పరిస్థితుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖాధికారులు హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి.

– తోట హనుమంతరావు, రైతు

అప్పు చేసి సాగు చేస్తున్నాం..



నేను 10 ఎకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేస్తున్నాను. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప జేయలేదు. దీంతో సాగుఖర్చుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పు తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తుఫాన్ హెచ్చరికలతో ఒకింత ఆందోళన కలిగిస్తోంది.

– వేల్పుల రాము, రైతు

రేపటి నుంచి ఉరుసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ పంజా సెంటర్‌లోని హజరత్ సయ్యద్(షా) మస్తాన్ వలి లోటిసోటే మస్తాన్ బాబా 104వ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 21 వరకూ నిర్వహించనున్నట్లు ముజావర్ మొహమ్మద్ ఇంతియాజుద్దీన్ తెలిపారు. ముజావర్ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉరుసు మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీ రాత్రి బాబా దర్బారు ప్రాంగణం 10 గంటలకు పకీర్ల మేళతాళాలు, గుర్రం మీద గంధం బిందెతో ఊరేగింపు పాతబస్తీ పురవీధుల మీదుగా నిర్వహిస్తామన్నారు. తెల్లవారు జామున మూడు గంటలకు పంజాసెటర్‌లోఉన్న దర్గా ప్రాంగణానికి చేరుతుందన్నారు. అనంతరం బాబా వారి మహాసమాధి మీద చాదర్ సమర్పిస్తామన్నారు. 20న దీపారాధన కార్యక్రమం ఉంటుందని, 21న బాబావారి దర్గా ప్రాంగణంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.



బాబా వారి సమాధి

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: ఎమ్మెల్యే



జగ్గయ్యపేటఅర్బన్: రోడ్డు మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పట్టణంలోని ముక్త్యాల రోడ్, విలియంపేట రైల్వేట్రాక్ వద్ద కోతకు గురైన రోడ్డుకు చేపట్టిన మరమ్మతు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పనులను పూర్తి చేయాలని కంట్రాక్టర్, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు అట్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన

జగ్గయ్యపేట అర్బన్: దొంగ ఓట్లతో నరేంద్ర మోదీ, ఎన్డీయే మిత్రపక్షాలు కూటమి కేంద్రంలో అధికారంలోకి వచ్చాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ తీరుకు వ్యతిరేకంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా పేట కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్నాటి అప్పారావు పాల్గొని ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు రేపాల మోహనరావు, దాచేపల్లి వీరభద్రరావు, నలజాల ధనుంజయరావు, కొమ్మినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు 'వాసిరెడ్డి' మృతి



వీరులపాడు: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వాసిరెడ్డి రాధాకృష్ణ(70) సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ సందర్శించి నివాళులర్పించారు. రాధాకృష్ణ మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. రాధాకృష్ణకు నివాళులర్పించిన వారిలో సీపీఐ నాయకులు దాములూరి మధుసూదనరావు, వట్టికొండ చంద్రమోహన్, కొండ్రగుంట శ్రీనివాస్‌కుమార్, చల్లా శ్రీను, చుండూరు సుబ్బారావు, గుల్‌అహ్మద్, నాగులు ఉన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో స్వామి వారి శాంతి కల్యాణం సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. బ్రాహ్మణ వీధిలోని ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయంలోని ప్రత్యేక వేదికపై వేంచేయించారు. అనంతరం మంగళవాయిద్యాలు, పండితుల వ్యాఖ్యానం, అర్చకుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విష్వక్సేనపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉభయదాతలు కొణిజేటి రమేష్ కాత్యాయిని దంపతులతో పాటుగా పలువురు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్, మురళీకృష్ణమాచార్యులు తదితరులు నిర్వహించారు.

బడ్డీకొట్టు ధ్వంసం చేసిన టీడీపీ నాయకుడు

అప్పు ఇవ్వలేదని దుశ్చర్య

కంచికచర్ల: అప్పు ఇవ్వలేదనే కోపంతో అధికారపార్టీ వార్డు సభ్యుడు ఓ మహిళకు చెందిన బడ్డీకొట్టును ధ్వంసం చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. టీడీపీ నాయకుడు, కంచికచర్ల గ్రామపంచాయతీ ఐదోవార్డు సభ్యుడు గూడవల్లి గణేష్ ఆదివారం రాత్రి తన స్నేహితులతో కలసి మద్యం సేవించేందుకు కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో ఏఎంసీ గేట్ వద్ద ఉన్న బడ్డీకొట్టు వద్దకు అప్పు ఇవ్వాలని అడిగాడు. బడ్డీకొట్టు నిర్వాహకురాలు అప్పు ఇవ్వలేనని చెప్పడంతో కోపోద్రిక్తుడైన గణేష్ మద్యంమత్తులో ఆ మహిళను దుర్భాషలాడటంతోపాటు కొట్టులోని వస్తువులను చిందరవందర చేశాడు. కొట్టు కోసం ఏర్పాటు చేసిన పాకను అధికారమదంతో ధ్వంసం చేశాడు. నేను కూటమి నాయకుడిని అంటూ కేకలు వేసుకుంటూ అక్కడ్నుంచి వెళ్లిపోయాడని బాధితులు తెలిపారు. బడ్డీకొట్టును ధ్వంసం చేయడంతో తమ ఉపాధి దెబ్బతిందని బాధితురాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



టీడీపీ నాయకుడి దుశ్చర్యతో ధ్వంసమైన బడ్డీకొట్టు

ఉత్తమ అధికారికి మాజీ ఎమ్మెల్యే అభినందనలు

నందిగామరూరల్: నందిగామ ప్రాంతానికి చెందిన తానూరి శ్రీనివాసరావు విశాఖపట్నం జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తూ ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందుకోవడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌గా అవార్డు అందుకున్న తానూరి శ్రీనివాసరావును ఆదివారం డాక్టర్ జగన్‌మోహనరావు కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ నిస్వార్థంతో పని చేసే అధికారులకు ప్రజల హృదయాల్లో ఎప్పటికీ స్థానముంటుందన్నారు. ఉత్తమఅధికారిగా నిలిచి నందిగామ ప్రాంతానికి మంచిపేరు తీసుకువచ్చిన తానూరి శ్రీనివాసరావు అందరికీ ఆదర్శప్రాయులని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆయన మరెన్నో అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకోవాలని ఆకాంక్షించారు. తానూరి శ్రీనివాసరావును అభినందించిన వారిలో కూచి వేణు, కొమ్మినేని సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



అవార్డు గ్రహీత తానూరి శ్రీనివాసరావును అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామలో నూతన వస్త్రదుకాణం ప్రారంభం

కంచికచర్ల:పేద మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా నాణ్యమైన, మన్నికైన వస్త్రాలను తక్కువ ధరకే అందించేలా నందిగామ పట్టణంలో జీవీ మాల్‌ను ప్రారంభించామని షోరూం అధినేత గుబ్బం ఉమామహేశ్వరరావు తెలిపారు. నందిగామ ఆసుపత్రి రోడ్డులో జీవీ మాల్‌ను సినీతార, యాంకర్ అనసూయ భరద్వాజ్ సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు చీరెలు, మగవారు, చిన్నపిల్లలు ధరించే డ్రస్‌లు షోరూంలో అందుబాటులో ఉన్నాయన్నారు. తమ 20వ బ్రాంచీని నందిగామలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో షోరూం అధినేతలు గుబ్బం వాసు మురళి, అంకిత్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.



మాల్‌ను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినితార, యాంకర్ అనసూయ

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చందర్లపాడు(నందిగామ టౌన్): గడ్డిమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చందర్లపాడులో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు చందర్లపాడు గ్రామసర్పంచ్ కస్తాల పున్నమ్మ సోదరుడు పోపూరి వీరబాబు (51) గ్రామపంచాయతీ పారిశుద్ధ్య విభాగంలో ఎన్‌ఎంఆర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో అతను గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతన్ని హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చందర్లపాడు ఎఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరబాబు మృతి విషయం తెలుసుకున్న నందిగామ మాజీశాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం

గోపినేనిపాలెం(వత్సవాయి): గోపినేనిపాలెం గ్రామ సహకార పరపతి సంఘ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం సొసైటీ ఆవరణలో జరిగింది. కమిటీ అధ్యక్షుడి గింజుపల్లి వీరబాబు ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీరబాబు మాట్లాడుతూ రైతులకు సకాలంలో పంట, బంగారంపై రుణాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్లమూడి రాంబాబు, తొండపు జగన్‌మోహన్‌రావు, జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి, కామినేని కిషోర్, సొసైటీ కార్యదర్శి శివరామకృష్ణ పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని వెల్లంకి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్‌గా యర్రంరెడ్డి శ్రీనివాసరావు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన కమిటీని అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి నరసింహారావు, నాయకులు చంద్ర సురేష్, శ్రీనివాస్ కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భావితరాలకు సాహిత్యఫలాలు అందించాలి

విజయవాడ కల్చరల్: భావితరాలకు సాహిత్యఫలాలు అందించాలని సేవ్ ఇండియా వ్యవస్థాపకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. విశ్వసాహితీ సాహిత్యవేదిక జాతీయ సంస్థ ఆవిర్భావ సభను ఏలూరు రోడ్డులోని ఇండియన్ మెడికల్ హాల్‌లో ఆదివారం నిర్వహించింది. సంస్థను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కవులు సామాజిక దృక్పథం కలిగివుండాలని సూచించారు. సమాజాన్ని అధ్యయనం చేయాలని సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే సాహితీ సృజన చేయాలని సూచించారు. 2026 జనవరిలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తునట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ బోణం గణేష్ రచించిన వర్ణం కవితా సంపుటిని ఆయన ఆవిష్కరించారు. గణేష్ కవిత్వం సామాజిక అంశాల సమాహారమన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు కొల్లి రమావతి సంస్థ లక్ష్యాలను వివరించారు. సమావేశంలో వివిధ రంగాలకు చెందిన గోళ్ళ నారాయణరావు, డాక్టర్ వెన్నావల్లభరావు, డాక్టర్ గుమ్మాసాంబశివరావు, డాక్టర్ జీవీ పూర్ణచందు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయకవితా గానం చేశారు. కవులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్, వేదికమీద డాక్టర్ గుమ్మా సాంబశివరావు తదితరులు